క్లుప్తంగా

నేడు పీలేరులో మెగా జాబ్‌మేళా

రాయచోటి జగదాంబసెంటర్ : ఏపీఎస్‌ఎస్‌డీసీ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లాలోని పీలేరులోని సంజయ్‌గాంధీ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 12వ తేదీన ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగమేళాలో ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని, ఆసక్తి గల యువతీయువకులు మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

108 సిబ్బందికి సామగ్రి వితరణ



108 సిబ్బందికి సామగ్రి అందజేస్తున్న దాత

సంబేపల్లె : మండల కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న 108 సిబ్బంది ఉంటున్న గదిలో సరైన వసతులు లేక అవస్థలు పడుతున్నారు. విషయం తెలుసుకున్న మండలానికి చెందిన భూషణం శ్రీనివాసులు కుటుంబసభ్యులతో చర్చించి, కుమారులు అన్నయ్య, మల్లికార్జునల సహకారంతో 108 సిబ్బందికి ఫ్యాన్, మంచాలు, వాటర్‌క్యాన్‌ను సోమవారం అందజేశారు. దాతకు 108 సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులకు వైద్యం అందిస్తున్న వైద్యులు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని అనంతరాజుపేట పంచాయతీలో నెల్లూరుకు చెందిన కరుణామయి చారిటబుల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 400 మందిని వైద్యులు పరీక్షించారు. నిర్వాహకులు మాట్లాడుతూ పరీక్షలు చేయించుకొన్నవారికి ఆపరేషన్‌లు అవసరమైతే ఉచిత ప్రయాణం, వసతులు కల్పించి వైద్యం చేయించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పంజం వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ బండారు మల్లికార్జున, ప్రజలు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు దీన్‌దయాళ్



నివాళులు అర్పిస్తున్న టీచర్లు, నాయకులు

సంబేపల్లె : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన సంబేపల్లె వాసి, వ్యాపారవేత్త ముంగర దీన్‌దయాళ్ ఎందరికో ఆదర్శప్రాయుడని గ్రామ సర్పంచ్ రామచంద్ర, గ్రామ పెద్దలు వి.వి ప్రతాప్‌రెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం ఆయన జయంతి సందర్భంగా సోమవారం ఆయన చిత్రపటానికి పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బందితో కలిసి ఘనంగా నివాళి అర్పించారు. ప్రతిభ చాటే విద్యార్థులను ఎంతో ప్రోత్సహించే వారన్నారు. అలానే విద్యార్థుల అవసరాలను తెలుసుకొని వారికి ఇబ్బందులు లేకుండా చేశారని ఈ సందర్భంగా నాయకులు చెప్పారు.

ఓ మోస్తరు వర్షం



ఓబులవారిపల్లెలో కురుస్తున్న వర్షం

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం మోస్తరు భారీ వర్షం కురిసింది. వారం రోజులుగా వర్షం కురవక మేఘాలు దోబూచులాడుతున్నాయి. రెండు రోజులకొక్కసారి రాత్రి సమయంలో గంటసేపు భారీ వర్షం కురుస్తోంది. దీంతో లోతట్టు ప్రాంతాలలో వర్షపునీరు చేరుతోంది. భారీ వర్షాలు కురిసి వంకలు పారి చెరువులోకి నీరు చేరాలని రైతులు కోరుకుంటున్నారు. వర్షాలు కురుస్తుండటంతో కర్బూజ రైతులు తమ పంటలు దెబ్బతిన్నాయని ఆందోళన చెందుతున్నారు.

పుండీశ్వర స్వామికి మహా కుంభాభిషేకం

రామసముద్రం : మండలంలోని మూగవాడి గ్రామంలో వెలిసిన పురాతన శ్రీ పుండీశ్వర స్వామికి సోమవారం శ్రావణమాసం సందర్భంగా వైభవంగా మహా కుంభాభిషేకం నిర్వహించారు. ఉదయం స్వామివారికి వేదపండితులచే వేదమంత్రాలతో రుద్ర నమకం, రుద్ర చమకం పఠనం చేశారు. అలాగే స్వామివారికి 101 బిందెలా నీరు పోసి మహా కుంభాభిషేకం చేశారు. అధిక సంఖ్యలో భక్తుల తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించారు. అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసి భక్తులకు అన్నదానం చేశారు.



ట్రాక్టర్‌తో పొలంలో దుక్కులు వేస్తున్న రైతులు

వర్షాలు కురిసె.. ఆశలు చిగురించె

రైతుల పట్ల వరుణుడు ఎట్టకేలకు కరుణ చూపాడు. మండలంలో మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు రైతాంగంలో ఆశలు నింపాయి. వారం క్రితం వరకు ఎండిపోయిన బోర్లు, బీడుబారిన భూములు దర్శనమివ్వగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పొలం సాగుకు సిద్ధమైంది. దీంతో ఖరీఫ్ పంటను వేసేందుకు పలువురు నిమగ్నమవ్వగా, ఇది వరకే పంట వేసిన రైతులు కలుపు ఏరివేసే పనుల్లో తలామునకలయ్యారు. చిన్నమండెం మండలంలో రైతులు వేరుశనగ, వరి, టమాట తదితర పంటలను అధిక విస్తీర్ణంలో సాగు చేసేందుకు సమాయత్తమవుతున్నారు. గతేడాది పండించిన పంటలకు గిట్టుబాటు లభించక తీవ్రంగా నష్టపోయిన రైతన్న.. ఇప్పుడైనా అరకొర లాభం చూసేందుకు గంపెడాశలతో వ్యవసాయాన్ని నమ్ముకొని పెట్టుబడులు పెడుతున్నారు. పంట చేతికొచ్చే సమయంలో ధర లాభదాయకంగా ఉండాలని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

– చిన్నమండెం



కూలీలతో వరినాట్లు వేయిస్తున్న రైతు

ఐడీబీఐ బ్యాంకును బలహీనపరచొద్దు



నిరసన తెలియజేస్తున్న యూనియన్ నాయకులు

రాజంపేట రూరల్ : లాభాల బాటలో నడుస్తూ లక్షల కోట్ల రూపాయాలు రిజర్వులున్న ఐడీబీఐ బ్యాంకును బలహీనపరచవద్దని యూనియన్ నాయకులు రామకృష్ణారెడ్డి హెచ్చరించారు. స్థానిక ఎల్‌ఐసీ బ్రాంచి కార్యాలయం ఎదుట సోమవారం ఎల్‌ఐసీ యూనియన్ అధ్యక్షులు పి.సుభాష్ చంద్ర ఆధ్వర్యంలో ఐడీబీఐ బ్యాంక్ ఉద్యోగులు దేశవ్యాప్త సమ్మెకు సంఘీభావంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ దేశంలో 2100 బ్యాంక్ శాఖలతో, రూ.4 లక్షల కోట్ల రిజర్వ్ నిధులతో ఐడీబీఐ పనిచేస్తోందన్నారు. 10 సంవత్సరాల క్రితం నష్టాలలో కొనసాగుతున్న ఐడీబీఐని ఎల్‌ఐసీ కొని దానిని లాభాల బాటలోకి తీసుకొచ్చిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనే రూ.7026 కోట్ల నిర్వహణ లాభాలను రూ.209 కోట్ల నికర లాభాలను ఐడీబీఐ సాధించిందన్నారు. ఇంత గొప్పగా పని చేస్తున్న ఐడీబీఐని డిసిన్వెస్ట్ చేయాలనుకోవటం ప్రైవేటు, విదేశీ కంపెనీలకు ఊడిగం చేయటమేనన్నారు. అదే విధంగా రీజనల్ రూరల్ బ్యాంక్‌ల షేర్లు అమ్మడానికి ఐపీఓ విడుదల చేయాలన్న ఆలోచనలతో ప్రభుత్వం ఉందన్నారు. ఇన్సూరెన్స్ రంగంలో 100 శాతం ఎఫ్‌డీఐ అనుమతించి విదేశీ కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం ఎర్ర తివాచీ పరుస్తోందన్నారు. దేశ ఆత్మ నిర్భర ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే ఇలాంటి చర్యలను ×జాయింట్ ఫ్రంట్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ ఇన్ ఫైనాన్షియల్ సెక్టార్‌×ఆధ్వర్యంలో తాము ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మట్లి రాజుల కోటలో తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటంలో సోమవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్‌ఆర్ జిల్లా పురాతత్వ సర్వేక్షణ కన్జర్వేషన్ అసిస్టెంటు ఢాకారెడ్డి ఆధ్వర్యంలో ఎంటీఎస్ స్వరూన్‌రామ్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపు మేరకు ఈనెల 2వ తేదీ నుంచి 15వ తేదీ వరకు హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. మండల కేంద్రంలో కూడా మట్లి రాజుల కోట నుంచి సిద్దవటం గ్రామ పురవీధుల్లో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించామన్నారు. ర్యాలీలో భారతమతాకీ జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, సిద్దవటం కోట సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ముత్తు మారెమ్మ జాతర



పాలపూజ నిర్వహిస్తున్న పూజారులు

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ పరిధి అరవపల్లెలో వెలసిన శ్రీ ముత్తు మారెమ్మ జాతర మహోత్సవాల సందర్భంగా మూడవ రోజు సోమవారం రాత్రి పాలపూజ కార్యక్రమం అర్చకులు నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి అమ్మవారిని శాంతింపజేశారు. మహిళలు పాలపూజ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన కోలాటం అందరినీ అలరించింది. పాలపూజ కార్యక్రమంతో అమ్మవారి జాతర మహోత్సవం ముగిసింది.

అందుబాటులో ఉండే వ్యక్తిని ఆశీర్వదించండి

వైఎస్ఆర్‌సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి



రాజంపేట/ఒంటిమిట్ట : ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని వైఎస్ఆర్‌సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను మండల ప్రజలందరికీ అందుబాటులో ఉండే వ్యక్తినని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం తాను ఎల్లప్పుడు ముందు ఉంటానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారికి అన్ని వేళలా వెన్నుదున్నుగా ఉండే మనస్తత్వం తనదన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో పోటీ చేస్తున్నానని.. ప్రతి ఒక్క ఓటరు నన్ను ఆశీర్వదించి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి, వేయించి గెలిపించాలని మండల ప్రజలను కోరారు. ఒంటిమిట్ట వాసులకు తాను ఎప్పుడూ రుణపడి ఉంటానని ఆయన పేర్కొన్నారు.

నిఖా వేడుకలో ఆకేపాటి



సుండుపల్లి : వైఎస్ఆర్‌సీపీ మైనార్టీ నాయకులు రషీద్‌బాషా కుమారుడి నిఖా వేడుకలలో అన్నమయ్య జిల్లా వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం మండల నాయకులతో కలిసి సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర బూత్ కమిటీల కార్యదర్శి రెహమాన్‌ఖాన్, వైస్ ఎంపీపీ రెడ్డమ్మ, సల్మాన్, జానీబాషా, రషీద్, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

బోరు ఉన్న రైతులకు ఉచితంగా మొక్కలు



మొక్కలు అందుకున్న రైతులతో రెడ్స్, సేవ్ ట్రీస్ సంస్థల ప్రతినిధులు

గాలివీడు : రెడ్స్, సేవ్ ట్రీస్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఉచితంగా మొక్కలు పంపిణీ చేసినట్లు రెడ్స్ సంస్థ కో–ఆర్డినేటర్ శ్రీనివాసులు తెలియజేశారు. సోమవారం మండలంలోని పలువురు రైతులకు మొక్కలను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలోని గాలివీడు, చిన్నమండెం, పెద్దమండ్యం, రామాపురం, లక్కిరెడ్డిపల్లి మండలాల్లో బోరు కలిగి నీటి సదుపాయం ఉన్న రైతులు తమ సిబ్బందిని 89771 78283 నెంబర్‌ను సంప్రదిస్తే మామిడి, సపోట, నేరేడు, నిమ్మ తదితర మొక్కలను ఉచితంగా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సేవ్ ట్రీస్ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ అరుణ్ కుమార్, రెడ్స్ ఫీల్డ్ కో–ఆర్డినేటర్ కిరణ్, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల ధర్నా

బి.కొత్తకోట: స్థానిక ఆటోడ్రైవర్లు సోమవారం నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తమ నుంచి రూ.10 వసూలు చేస్తున్న గేటును ఇవ్వలేమని చెబుతూ ఆందోళన చేపట్టారు. గేటు వసూలు లీజు పొందిన గుత్తదారుడు ప్రతిరోజూ రూ.10 వసూలు చేస్తున్నారని కమిషనర్ జీవీ.పల్లవికి వివరించారు. దీనిపై ఆమె మాట్లాడుతూ గుత్తదారుడికి వసూలు చేసే హక్కు ఉందని చెప్పారు. నిబంధనల మేరకే వసూలు చేస్తారని, గేటు చెల్లించాల్సిందేనని స్పష్టం చేశారు.



పూజలందుకున్న అక్కులమ్మ



కొండపైన ఉన్న దేవర దొన వద్ద భక్తులు

అక్కులమ్మకు బోనాలు

చిన్నమండెం : మండల పరిధిలోని పడమటికోన గ్రామం బోరెడ్డిగారిపల్లెలో వెలసియున్న అక్కులమ్మకు గ్రామ ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొండపై వెలసియున్న అమ్మవారిని ప్రత్యేక పూలతో అలంకరించి పూజాది క్రతువులను నిర్వహించారు. అనంతరం బెల్లంతో చేసిన అన్నం బోనాలను అమ్మవారికి సమర్పించి తమ మొక్కుబడులను గ్రామ ప్రజలు తీర్చుకున్నారు. అదే విధంగా కొండపై గల దేవర దొన దగ్గర భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

మిథున్‌రెడ్డికి బెయిల్ రావాలని పూజలు

మదనపల్లె: మద్యం అక్రమ కేసులో అరెస్టయిన ఎంపీ మిథున్‌రెడ్డికి బెయిల్ రావాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్ ప్రార్థిస్తూ పూజలు నిర్వహించారు. సోమవారం స్థానిక నీరుగట్టువారిపల్లెలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కురబ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ డి.రామాంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయం ఎదుట 101 టెంకాయలను కొట్టారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మిథున్‌రెడ్డికి బెయిల్ రావాలని ప్రార్థించారు. అక్రమ కేసులతో కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నేతలను వేధిస్తూ జైళ్లకు పంపుతోందని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరపన మనూజ, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపు ఎత్తివేయించి పుణ్యం కట్టుకోండి



బెల్టుషాపు ఎత్తివేయించాలని సబ్ కలెక్టర్ చల్లా కల్యాణికి విన్నవిస్తున్న ఎనుములవారిపల్లె మహిళలు

మదనపల్లె రూరల్ : గ్రామంలోని బెల్టుషాపు కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, బెల్టుషాపు ఎత్తివేయించి పుణ్యం కట్టుకోండి మేడమ్ అంటూ మదనపల్లె మండలం కొత్తవారిపల్లె పంచాయతీ ఎనుములవారిపల్లెకు చెందిన మహిళలు సబ్ కలెక్టర్ చల్లా కల్యాణికి వినతిచేశారు. సోమవారం సబ్ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్) కార్యక్రమానికి మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని 11 మండలాల నుంచి వివిధ రకాల రెవెన్యూ సమస్యలపై 72 ఫిర్యాదులు అందాయి. ఎనుములవారిపల్లెకు చెందిన మహిళలు తమ గ్రామంలో అంగజాల భాస్కర్, రమాదేవి, శ్రీనివాసులు, టి.నారాయణ, అనూరాధ అనే వ్యక్తులు యథేచ్ఛగా బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు ఫిర్యాదుచేసినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. గతంలో జైలుకు వెళ్లినప్పటికీ ఏమాత్రం లెక్కచేయకుండా బెల్టుషాపు నిర్వహిస్తున్నారన్నారు. వీరిపై చర్యలు తీసుకుని, గ్రామంలో మద్యం విక్రయించకుండా చూడాలని కోరారు.

– అనంతపురంలోని నడివంకలో కాపురం ఉంటున్నప్పుడు టిడ్కో ఇంటి కోసం రూ.500 చెల్లించి దరఖాస్తు చేసుకున్నామని, పట్టా ఇచ్చిన తర్వాత ఇల్లు ఇవ్వకపోవడంతో జీవనోపాధిలో భాగంగా ఐదేళ్ల క్రితం మదనపల్లెకు వచ్చేశామని, ప్రస్తుతం ఇంటికి దరఖాస్తు చేసుకుంటే ఆన్‌లైన్‌లో ఇవ్వని టిడ్కో ఇల్లును చూపిస్తోందని, దాన్ని రద్దు చేసి మదనపల్లెలో ఇల్లు కేటాయించాల్సిందిగా ఎస్.అయేషా ఫాతిమా సబ్ కలెక్టర్‌కు వినతిచేసింది.

– రేషన్‌కార్డులో గ్రామ సచివాలయ ఉద్యోగం పొందిన కూతురు పేరు ఉందని రద్దుచేశారని, కుమార్తెకు వివాహమై వేరుగా ఉంటోందని, వృద్ధులమైన తమకు రేషన్‌కార్డు మంజూరుచేసి వృద్ధాప్యంలో ఆదుకోవాల్సిందిగా పోతబోలు కూగర్తి గంగులప్ప, శంకరమ్మలు విన్నవించారు.

వేడుకగా విగ్రహ ప్రతిష్టాపనోత్సవం



పూజలందుకున్న ప్రతిష్ఠిత విగ్రహాలు

గాలివీడు : మండలంలోని నూలివీడు పంచాయతీ బోడసానివాండ్లపల్లెలో సోమవారం సీతారామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ప్రతిష్టాపన పూజల్లో మొదటి రోజు 9వ తేదీ కలశ స్థాపన, మంటపం ఆరాధన, అగ్ని ప్రతిష్టాపన దీక్ష, హోమాలు, తీర్థ ప్రసాదాలు, మంగళహారతి వంటి కార్యక్రమాలను నిర్వహించారు. 10వ తేదీన ప్రాతఃకాల పూజలు విశేష హోమాలు, యంత్రాభిషేకం, మహాస్నపనం, పుష్ప పూజ వంటి కార్యక్రమాలను నిర్వహించగా, సోమవారం సీత, రామ, లక్ష్మణ, ఆంజనేయుని విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం కల్యాణ వేడుకను జరిపించారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాన్ని అందజేశారు.

హామీ నిలుపుకోని కూటమి ప్రభుత్వం

మదనపల్లె రూరల్ : ఏడాదిలోపు సీపీఎస్ రద్దుకు పరిష్కారం చూపిస్తామని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హామీ ఇచ్చి సంవత్సరం పూర్తయిందని, ఇప్పటివరకు హామీ నెరవేర్చకపోగా డీఏ బకాయిలు ఇవ్వలేదని ఏపీ సీపీఎస్‌ఈఏ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రంజిత్, ఉపాధ్యక్షులు సారకాయల శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేంద్రకుమార్ అన్నారు. సోమవారం సబ్ కలెక్టరేట్ ఆవరణలో సీపీఎస్ ఉద్యోగులతో కలిసి, సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహదినం, చలో విజయవాడ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఐదేళ్లు రాజకీయసేవ చేసే ఎంపీ, ఎమ్మెల్యేలు రెండు రకాల పెన్షన్‌లు తీసుకుంటుంటే, 35 సంవత్సరాలు ప్రభుత్వ సర్వీస్ చేసే ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. సీపీఎస్ రద్దుచేసి, పాత పెన్షన్ ఇవ్వకపోతే తీవ్రంగా ఉద్యమాలు చేయాల్సి వచ్చిందని, కూటమిప్రభుత్వం ఇకనైనా స్పందించి పాత పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు చేయని పక్షంలో అన్ని సంఘాలను కలుపుకుని ఉద్యమాన్ని ఉధృతం చేస్తా మని హెచ్చరించారు.

ఆర్టీసీలో ఆన్‌కాల్ డ్రైవర్ ఉద్యోగాలు

మదనపల్లె సిటీ: ఆన్‌కాల్ పద్ధతిపై డ్రైవర్ పోస్టులకు అర్హులైన వారిని ఎంపిక చేయనున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆన్‌కాల్ పద్ధతిపైన డ్రైవర్ పోస్టుకు అభ్యర్థులు వయోపరిమితి 21–40 సంవత్సరాలు ఉండాలన్నారు. హెవీవెహికల్ లైసెన్స్ కలిగి ఉండాలని, డ్రైవింగ్‌లో 18 నెలల అనుభవం కలిగి ఉండాలన్నారు. ఆర్టీఏ క్లియరెన్స్ అర్హత గల సర్టిఫికెట్లతో వన్ డిపో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఘనంగా కోలాటం, గజ్జపూజ



కోలాట భజనలు చేస్తున్న విద్యార్థులు

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటం గాంధీ వీధిలో ఆదివారం రాత్రి కోలాటం గజ్జపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కోలాట భజనల గురువు సుబ్బారెడ్డి వద్ద రెండు నెలలుగా శిక్షణ పొందుతున్న వారు కోలాటాన్ని ప్రదర్శించారు. కోలాట ప్రదర్శనను చూడటానికి పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొని ఉర్రూతలూగారు. ప్రదర్శన ఆద్యంతం చూపరులను కట్టి పడేసింది. కాగా గ్రామపెద్దలు లైటింగ్, సెట్టింగ్‌లను అందించి సహకరించారు.

నేడు నులిపురుగుల నివారణ మందు పంపిణీ



సుండుపల్లె: కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అధికారులు



రాయచోటి టౌన్: వైద్యాధికారులతో కలసి పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డాక్టర్ రియాజ్ బేగ్

సుండుపల్లె : జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారులు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు విజయవంతం చేయాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ దిలీప్‌గుప్తా తెలిపారు. మంగళవారం (నేడు) ఒక సంవత్సరం నుంచి 19 సంవత్సరాలలోపు పిల్లలకు రక్తహీనత రాకుండా ఉండేందుకు మండలంలోని అన్ని అంగన్వాడీ సెంటర్లు, పాఠశాలలు, కాలేజీలలో ఉండే 10,309 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించడం జరుగుతుందని ఆయన తెలిపారు. సోమవారం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను వైద్యాధికారి సిబ్బందితో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 రవీంద్రనాయక్, డాక్టర్ ఫర్హాఖానం, అంగన్వాడీలు పాల్గొన్నారు.

రాయచోటిలో ర్యాలీ

రాయచోటి టౌన్ : చిన్న పిల్లల కడుపులో నులిపురుగు చేరితే అనేక రకాల వ్యాధులకు గురి చేస్తుందని, నివారణకు ఆల్బెండజోల్ గుళికలు మింగిస్తే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని జిల్లా ఆరోగ్య ప్రోగ్రాం, మానిటరింగ్ అధికారి డాక్టర్ రియాజ్ బేగ్ అన్నారు. సోమవారం రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్ కాలనీ నుంచి బంగ్లా, ఠానా, ప్రభుత్వ ఆస్పత్రి వరకు నులిపురుగు నివారణపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగు నివారణ కోసం ఆల్బెండజోల్ గుళికలు మింగించాలని అందుకు నేడు (12వ తేదీ) అన్ని పాఠశాలలోని విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఏదైనా కారణాల చేత పాఠశాలకు హాజరుకాని విద్యార్థులు ఉంటే ఈ నెల 20వ తేదీ మింగించాలని సూచించారు. ర్యాలీలో హెల్త్ సూపర్‌వైజర్ నూర్జహాన్, హెల్త్ అసిస్టెంట్‌లు రవిశంకర్, ఖాదర్ బాషా, దామోదర్ రాజు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

కలలు సాకారం చేసుకోవాలి

కురబలకోట : కొత్తగా బీటెక్‌లో చేరడం జీవితంలో మరచిపోలేని ఆరంభమని భవిష్యత్ కలల సాకారానికి నిరంతరం కృషి చేయాలని బెంగళూరు ఇన్ఫోబెల్ ఐటీ సొల్యూషన్స్ డైరెక్టర్ ఎస్‌జి గౌడ సూచించారు. అంగళ్లులోని విశ్వం ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ నూతన విద్యార్థులకు సోమవారం సంస్థ అధినేత ఎం. ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌జి గౌడ మాట్లాడుతూ బీటెక్ సమస్యలను పరిష్కరించే శక్తిని ఇస్తుందన్నారు. మరో విశిష్ట అతిథి బెంగళూరు ఎతినెస్ వైస్ ప్రెసిడెంట్ జేమ్స్ క్రిస్టి మాట్లాడుతూ తల్లిదండ్రులు కన్న కలలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు చదవు సంధ్యల్లో రాణించాలన్నారు. అనంతపురం జెఎన్‌టీయూ అకడమిక్ ఆడిట్ డైరెక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ భవిష్యత్తును దిశ నిర్దేశం చేసుకుని ముందుకు సాగాలన్నారు.